క్లుప్తంగా

విద్యార్థులకు కంటి పరీక్షలు



పరీక్షిస్తున్న వైద్యులు

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో ఆదివారం మోసిస్ పాఠశాల హెల్త్ ఐ కేర్ ప్రాజెక్ట్ ఉచిత కంటి పరీక్షలు నిర్వహించినట్టు సంస్థ మేనేజర్ తెలిపారు. విద్యార్థుల అంధత్వ నివారణే లక్ష్యంగా తమ సంస్థ పనిచేస్తోందన్నారు. కంటి సమస్యలతో బాధపడే విద్యార్థులు తమను ఆశ్రయించాలని ఆయన కోరారు.

శరభవరంలో తాగునీటి ఎద్దడి



నిరుపయోగంగా వాటర్ ట్యాంక్

రాజవొమ్మంగి: మండలంలోని శరభవరం గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తింది. గ్రామంలోని రెండు తాగు నీటి ట్యాంకులు నెల రోజులుగా మూలకు చేరడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో 300 గృహాలున్నాయి. గ్రామంలో మూడు చేతి బోర్లు ఉండగా, ఒకటే పనిచేస్తోందని, నీటి అవసరాల కోసం సమీపంలో నూతులపై ఆధాపడాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతుల్లో నీరు చాలా లోతుగా వుండడంతో తోడుకోవడం కష్టసాధ్యంగా ఉందంటున్నారు. కలుషిత నీరు వల్ల రోగాలు ప్రబలే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

పాడేరు రూరల్: కాకినాడ జిల్లా జి.రాగంపేట ఆయిల్ ఫ్యాక్టరీలో ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందిన గిరిజన కుటుంబాలకు ఒక్కొక్కరికి ప్రభుత్వం రూ.కోటి పరిహారం ప్రకటించాలని మాజీ ఎమ్మెల్యే, బీఎస్పీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ లకే రాజారావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బాధిత నిరుపేద గిరిజన కుటుంబాలకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు.

వెతలు తీరేనా!

- ఆనకట్ట నిర్మాణానికి రైతుల వినతి



కిర్రాబు వద్ద చిన్నేరు వాగు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని మడేరు ఏరుపై సాగునీటి ఆనకట్టు నిర్మించాలని ఏళ్ల తరబడి కోరుతున్న గిరిజన రైతుల ఆవేదన అరణ్యరోదనాగా మారింది. చింతపల్లి తదితర ఎగువ ప్రాంతాల్లో కురిసే వర్షాలే చిన్నేరు వాగుకు ఆధారం. జీవనదిగా పేరున్న ఈ వాగుపై కిర్రాబు వద్ద ఆనకట్ట నిర్మిస్తే మండలంలోని కింద్ర, లాగరాయి, లబ్బర్తి, తంటికొండ, దూసరపాము పంచాయతీల్లోని సుమారు 11 గ్రామాలకు చెందిన సుమారు 5వేల ఎకరాల మెట్టభూమికి సాగునీరు లభిస్తుంది. ఆనకట్ట నిర్మాణం కోసం ఏళ్లతరబడి రైతులు కోరుతున్నారు. టీడీపీ హయాంలో కిర్రాబు ఆనకట్ట పనులు ప్రారంభిస్తామని ప్రభుత్వం ప్రచారం చేసింది. సబ్‌ప్లాన్ నిధులను కేటాయించినట్టు అప్పట్లో ఐటీడీఏ అధికారులు ప్రకటించారు. ఆ తరువాత అంచనా వ్యయం పెరిగిందని, నిర్మాణ వ్యయాన్ని రూ.50 కోట్లకు పెంచినట్టు కూడా వార్తలు వచ్చాయి. పలు గ్రామాలకు సాగునీరందించేందుకు దాదాపు 11 కిలోమీటర్ల నిడివి గల పంటకాలువ నిర్మాణానికి ప్లాన్ సిద్ధం చేశారు. ఈ కాలువ ద్వారా ఐదు పంచాయతీల్లోని 11 గ్రామాల్లోని మెట్ట పొలాలకు సాగునీరు అందుజేయవచ్చని అధికారులు తెలిపారు. అయితే ఆనకట్ట నిర్మాణ పనులు కనీసం ప్రారంభానికి నోచుకోలేదని రైతులు చెబుతున్నారు. ఈ ఆనకట్ట నిర్మాణానికి సంబంధించి వివరాలు తీసుకునేందుకు సంభందిత మైనర్ ఇరిగేషన్ అధికారులు ఎవరూ అందుబాటులో లేరు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కిర్రాబు ఆనకట్ట నిర్మించి సాగునీటి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

ఆహ్లాదం మాటున ఆపద

- ఘాట్‌రోడ్డులో రక్షణగోడలు కరవు
- ఓవర్‌లోడ్ లారీలతో తలెత్తుతున్న ఇబ్బందులు



ఘాట్‌రోడ్‌లో బోల్తా పడిన టూరిస్టు బస్సు(ఫైల్)



ఘాట్‌రోడ్‌లో రక్షణగోడ లేని మలుపు

చింతూరు: చింతూరు, మారేడుమిల్లి ఘాట్‌రోడ్‌లో ప్రయాణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. అయితే ఈ ఆహ్లాదం మాటున ఆపద పొంచి ఉంది. ఎత్తుపల్లాలు, మలుపులు, ఓపక్క కొండ, మరో పక్క లోయ, జలపాతాలు, మధ్యలో వ్యూపాయింట్‌లు ఈ రోడ్డులో ప్రయాణించే వారికి మంచి అనుభూతిని ఇస్తాయి. మారేడుమిల్లి మండలం పాములేరు నుంచి చింతూరు మండలం తులసిపాక వరకు ఈ అందాలన్నీ ప్రయాణికులకు కనువిందు చేస్తాయి. అయితే ఇదంతా నాణేనికి ఒకవైపే అన్నట్టుగా.. అదే ఘాట్‌రోడ్‌లో అడుగడుగునా ప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయి. చింతూరు, రంపచోడవరం ఆర్అండ్‌బీ సబ్ డివిజన్‌లో ఈ ఘాట్‌రోడ్ 25 కిలోమీటర్ల పొడవు ఉంటుంది

పొంచి ఉన్న ప్రమాదం

ఘాట్‌రోడ్ పొడవునా ఓ వైపు లోయ ఉండడంతో ప్రమాదం పొంచి ఉంది. లోయవైపు రక్షణగోడలు, ప్రమాదాన్ని తెలిపే సూచికలు లేకపోవడంతో చాలా వాహనాలు లోయలో పడిన సంఘటనల్లో అనేక మంది దుర్మరణం పాలయ్యారు. గతంలో పలుచోట్ల రక్షణగోడలు నిర్మించినా అనంతర కాలంలో రహదారుల వెడల్పు, వర్షాలకు కొట్టుకొచ్చిన మట్టితో పూడుకుపోయాయి. మూడేళ్ల కిందట ఘాట్‌రోడ్ వెడల్పు చేసినా నేటికీ రక్షణగోడలు నిర్మించలేదు. దీంతో చాలా వాహనాలు ఘాట్‌రోడ్ ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు అదుపుతప్పి లోయలోకి పడిపోతున్నాయి. ఘాట్‌రోడ్ దిగే సమయంలో హైగేర్‌లో నెమ్మదిగా దిగాలనే నిబంధన ఉన్నా కొంతమంది డ్రైవర్లు పాటించడం లేదు. ఫలితంగా ప్రమాదాల బారిన పడుతున్నారు. మరోవైపు వివిధ డిపోల నుంచి విలీన మండలాలకు తిరుగుతున్న ఆర్టీసీ బస్సులు సైతం సరైన ఫిట్‌నెస్ లేకపోవడంతో మొరాయిస్తున్నాయి. ప్రధానంగా ఇటీవల బ్రేకులు ఫెయిలై అనేక బస్సులు నిలిచిపోయిన సంఘటనలున్నాయి. దీంతో ప్రయాణికులు గంటల తరబడి తిండితిప్పలు లేక ఘాట్‌రోడ్ లోనే వేచి ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు ఘాట్‌రోడ్ కొన్నిచోట్ల 7 మీటర్లు, మలుపుల వద్ద ఐదున్నర మీటర్ల వెడల్పు మాత్రమే ఉండడంతో వాహనాల ప్రమాదాలు అధికంగా చోటు చేసుకుంటున్నాయని పలువురు చెబుతున్నారు.

ఘాట్‌రోడ్డులో ప్రమాదాలెన్నో

- చింతూరు, మారేడుమిల్లి ఘాట్‌రోడ్డులో జరిగిన ప్రమాదాల వల్ల ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. దుర్గగుడి సమీపంలోని గోపి టర్నింగ్ వద్ద విజయవాడ కనకదుర్గ దర్శనానికి వెళ్తున్న భక్తులు ప్రయాణిస్తున్న వ్యాను లోయలో పడి ఏడుగురు భవానీలు మృత్యువాత పడ్డారు.
- దుర్గగుడి సమీపంలోనే కూలీలతో వెళ్తున్న లారీ బోల్తాపడి ఐదుగురు పొగాకు కూలీలు మృతి చెందారు.
- గత ఏడాది డిసెంబరులో చింతూరులో జరిగిన ఓ ఆధ్యాత్మిక కార్యక్రమం ముగించుకొని టాటా మ్యాజిక్‌పై కాకినాడ వెళ్తుండగా లోయలో పడి కాకినాడ, సామర్లకోటకు చెందిన ఐదుగురు మృతి చెందారు.



మలుపు వద్ద అతికష్టంగా ఘాట్ దిగుతున్న లోడు లారీ

- ఇజ్జలూరు సమీపంలో మలుపువద్ద తీర్థయాత్రలకు వెళ్లి భక్తులతో తిరిగివస్తున్న బస్సు బోల్తాపడి తెలంగాణాకు చెందిన ఓ ప్రయాణికురాలు మృతి చెందింది.
- టైగర్ క్యాంపు సమీపంలో జరిగిన కారు ప్రమాదంలో జెన్‌కోకు చెందిన ఇంజినీర్ మృతిచెందగా దుర్గగుడి సమీపంలో లారీ లోయలో పడిన ఘటనలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన డ్రైవర్ మృతి చెందాడు.
- మారేడుమిల్లి సమీపంలో యాత్రికుల బస్సు ప్రమాదానికి గురై కర్నాటకకు చెందిన ఐదుగురు, అనంతపురం జిల్లాకు చెందిన ఇద్దరు మృత్యువాత పడ్డారు. రెండు రోజుల క్రితం లారీ లోయలోకి బోల్తాపడిన ఘటనలో ప్రకాశం జిల్లాకు చెందిన ఇద్దరు మృతిచెందారు.

ఇంటింటా సంక్షేమం జగనన్నతోనే సాధ్యం



కోడేలిలో గిరిజనులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, చిత్రంలో ఎంపీపీ రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగం

- అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రతి పేదవాడికి మేలు జరిగిందని, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని కోడెలి, ఈతగుప్ప గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే, స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. గ్రామస్తులు గిరిజన సంప్రదాయంతో ఎమ్మెల్యే పాల్గుణకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో 195 గడపలను ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి ఆప్యాయంగా పలకరించి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతీరుపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ఇంటింటా సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. గిరిజన ప్రాంతాభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని, శివారు గ్రామాల్లోనూ మౌలిక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. కోడెలి గ్రామానికి చెందిన మహిళలకు వైఎస్సార్ చేయూత నగదు ప్రభుత్వం జమ చేయడంపై వారు ఆనందం వ్యక్తం చేసి, ఎమ్మెల్యే పాల్గుణను సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామాల్లో పలు సమస్యలను పరిశీలించి, తక్షణమే పరిష్కరిస్తానని గిరిజనులకు ఎమ్మెల్యే పాల్గుణ హామీ ఇచ్చారు. ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం, మాజీ ఎంపీపీ మత్తిరి రవిప్రసాద్, నాయకులు కోటిబాబు, భూషణ్, సాయిప్రసాద్, అనిల్, కామరాజు తదితరులు పాల్గొన్నారు.

సూర్యనారాయణమూర్తి ఉత్సవ విగ్రహ ఊరేగింపు

అనకాపల్లిటౌన్ : స్థానిక రాజుపాలెం సూర్యనారాయణమూర్తి దేవాలయానికి కశింకోట మండలం గవరపేట వీధికి చెందిన వేగి దొరబాబు దంపతులు సూర్యనారాయణమూర్తి ఉత్సవ విగ్రహాన్ని దేవాలయ చైర్మన్ కొణతాల బాబూరావు చేతుల మీదుగా ఆదివారం అందించారు. ఈ ఉత్సవ విగ్రహాన్ని రాజుపాలెం పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ రూ.80 వేలుతో తయారు చేసిన ఉత్సవ విగ్రహాన్ని ఆలయానికి అందించిన దొరబాబు దంపతులను అభినందించారు.



రాజుపాలెం వీధిలో ఉత్సవ విగ్రహ ఊరేగింపు

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

- హుకుంపేట,రంపచోడవరం, మోతుగూడెం ప్రాంతాల్లో వైద్య శిబిరాలు
- తరలివచ్చిన గిరిజనులు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు



హుకుంపేటలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో రామచంద్రరావు తదితరులు



రోగికి సూచనలిస్తున్న వైద్యుడు

హుకుంపేట: కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ ఆదేశాల మేరకు మండలంలోని బూర్జ పంచాయతీ మజ్జివలస ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాలలో ఆదివారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో పాఠశాల విద్యార్థులతో పాటు స్థానిక, పరిసర గ్రామాల నుంచి వచ్చిన సుమారు 500 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. వైద్య శిబిరాన్ని ఎంఈవో ఎస్.రామచంద్రరావు, ఏటీడబ్ల్యూవో రజిని, సీడీపీవో బాలచంద్రమణి దేవి, వైద్యాధికారి అనూషా తదితరులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య శిబిరాలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్య శాఖ కో–ఆర్డినేటర్ జయరాజ్, హెచ్ఎం రజిని, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం: మండల కేంద్రంలోని రామకృష్ణ మిషన్ ఆస్పత్రి వద్ద ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. రాజమండ్రికి చెందిన రామకృష్ణ మిషన్ సంచార వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 300 మందికి వైద్య పరీక్షలు చేసినట్టు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి వినిశ్చిలానందజీ తెలిపారు. శిబిరంలో 76 మందికి రక్తపరీక్షలు, ఎక్స్‌రేలు, ఇతర వైద్య పరీక్షలు చేశామన్నారు. పరమహంస యోగానంద నేత్రాలయం(వేమగిరి) ఆధ్వర్యంలో 100 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 14 మందికి కళ్లద్దాలు, 8 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్ కోసం వేమగిరి తరలించామన్నారు. రోగులకు, సహాయకులకు భోజన సదుపాయం కల్పించినట్టు చెప్పారు. శిబిరంలో వైద్యులు తలారి వెంకటరమణ, శ్రీనివాస్, జి.భాస్కర్, సంపత్‌కుమార్‌లు పాల్గొని వైద్య సేవలందించినట్టు చెప్పారు. రామకృష్ణ మిషన్ మెడికల్ క్యాంప్ కో–ఆర్డినేటర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

మోతుగూడెం: మండలంలోని మంగంపాడు గ్రామంలో శ్రీ సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో గుండె, చర్మ, కీళ్ల, కంటి వ్యాధులు, దంతాలు సంబంధించిన వైద్య నిపుణులు పరీక్షల నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మెగా వైద్య శిబిరంలో ఆంధ్ర, ఒడిశాకు చెందిన 25 గ్రామాల నుంచి 1025 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా 157 మందికి కళ్లద్దాలు అవసరమని వైద్య నిపుణులు సూచించారు. శస్త్ర చికిత్సలు అవసరమైన 15 మందిని రాజమండ్రి తరలించారు. రాజమండ్రి చెందిన ప్రముఖ వైద్య నిపుణుడు గోలి రామారావు పర్యవేక్షణలో శిబిరం జరిగింది. శిబిరానికి వచ్చిన గిరిజనులకు భోజన సదుపాయం కల్పించారు. వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



రంపచోడవరం ప్రభుత్వ పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు



ఏపీ జెన్‌కో స్కూల్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

రంపచోడవరం: రంపచోడవరం ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో సమావేశమయ్యారు. 1985–86 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు కలుసుకుని సందడి చేశారు. ఒకరికొకరు అప్యాయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి గురువులను ఘనంగా సత్కరించారు. సహపంక్తి భోజనాలు చేశారు. ఎక్కడెక్కడో స్థిర పడ్డ వారిని ఒకే వేదికపైకి తీసుకువచ్చేందుకు స్థానిక లెనోరా ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న చాకలి దుర్గారావు కృషి చేశారు. అందరికి సమాచారాన్ని అందించి రంపచోడవరంలో కలుసుకునేందుకు ఏర్పాట్లు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు.

మోతుగూడెంలో...

మోతుగూడెం : మోతుగూడెం ఏపి జెన్‌కో ప్రాజెక్టు ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక కార్యక్రమం ఆదివారం జరిగింది. పాఠశాలలో 2002–03 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు కలుసుకున్నారు. ఒకొరికొకరి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. తమకు విద్యాభ్యాసాలు నేర్పిన గురువులను సన్మానించారు. ఉల్లాసంగా..ఉత్సాహంగా గడిపారు. విద్యార్థులు గోవిందరాజులు, గణేష్, మల్లికార్జున, రాజా, సంజీవ్, రాజా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరమ్మ నిమజ్జనం



శారదానదిలో గౌరీపరమేశ్వరుల నిమజ్జనం

కశింకోట : కశింకోటలో ప్రసిద్ధి చెందిన గౌరీపరమేశ్వరుల(గౌరమ్మ) ఉత్సవం ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా స్థానిక డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్దున్న ఆలయం నుంచి గౌరమ్మను రథంపై దాడి వారి వీధి, గవరపేట మధ్య వీధి, పెద్దగుమ్మం వద్ద శారదానది ఒడ్డు వరకు ఊరేగించారు. భారీ సంఖ్యలో భక్తులు హాజరై రథాన్ని త్రాడుతో ముందుకు లాక్కుంటూ వెళ్లారు. ఆర్కెస్ట్రా పాటలు, బాణసంచా కాలుస్తూ ఊరేగింపు సాగింది. దారి పొడవునా భక్తులు అమ్మ వారిని దర్శించి పూజలు చేశారు. అనంతరం నది ఒడ్డున గౌరమ్మకు వేద మంత్రాల నడుమ పూజలు చేసి సంప్రదాయంగా నదిలో నిమజ్జనం చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను అలరించాయి. ఉత్సవంలో అంధులు పలుచోట్ల పాడిన పాటలు ఆహూతులను అలరించాయి. భారీ ఎత్తున బాణ సంచా కాల్చారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు వేగి గోపీకృష్ణ, పెంటకోట రాము, వేగి దొరబాబు, భీశెట్టి ఆనంద్, కోయిలాడ నాగు, తదితరులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. సిఐ రవికుమార్, ఎస్ఐలు ఎ.ఆదినారాయణరెడ్డి, జె.నాగేశ్వరరావు బందోబస్తు పర్యవేక్షించారు.

గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి

- ఇర్లవాడలో ప్రజాప్రతినిధుల పల్లెనిద్ర
- గ్రామంలో సమస్యల పరిశీలన



ఇర్లవాడలోని పల్లెనిద్రలో భాగంగా గ్రామస్తులతో ప్రజాప్రతినిధులు, నాయకులు

వై.రామవరం: గ్రామాల్లో సమస్యలు తెలుసుకునేందుకు ఎంపీపీ కడబాల ఆనందరావు అధ్యక్షతన మండల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లెనిద్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా శనివారం రాత్రి మండల ఎగువప్రాంతం దారగడ్డ పంచాయతీ ఇర్లవాడ గ్రామంలో పల్లెనిద్ర చేశారు. ఎంపీపీతోపాటు జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు వీరమళ్ల సుబ్బలక్ష్మి, వైస్ ఎంపీపీ ముర్ల జోగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు గ్రామాల్లోని సమస్యలను స్వయంగా గుర్తించి, పరిష్కరించేందుకు పల్లెనిద్ర కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. అంచలంచెలుగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి సమస్యలు పరిష్కారానికి శ్రీకారం చుడతామన్నారు. గ్రామంలోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అందరికీ పథకాలు అందేలా చూడాలని గ్రామ వలంటీర్లకు సూచించారు. అటవీశాఖ అభ్యంతరాలతో నిలిచిపోయిన వై.రామవరం నుంచి మఠంభీమవరం మీదుగా గుర్తేడు రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరారు.దీనిపై ఎంపీపీ ఆనందరావు స్పందించి మాట్లాడుతూ సమస్యను కలెక్టర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గ్రామంలోని ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శనివారం రాత్రి దట్టమైన, అటవీ ప్రాంతం, కొండలనడుమ ఉన్న ఇర్లవాడ గ్రామంలో చలి ఎక్కువగా ఉండడంతో కర్రలు, దుక్కలతో మంటవేసి, మంట చుట్టు కూర్చొని, అక్కడే పల్లె నిద్ర చేశారు. తమ గ్రామ సమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులు, నాయకులు పల్లెనిద్ర చేయడం పట్ల ఇర్లవాడ గ్రామస్తులు ప్రజాప్రతినిధులకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా గ్రామంలోనే సమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు త్రిమూర్తులు, కనకరాజు, భారతిబాబు, బాబి, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన



అరమ గ్రామంలో స్థానికులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న నాయకురాలు శాంతి

డుంబ్రిగుడ: మండలంలోని అరమ పంచాయతీలో మండల పార్టీ మహిళ అధ్యక్షురాలు శాంతి ఆధ్వర్యంలో గృహ సారథులు, గ్రామ వలంటీర్లతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా నాయకురాలు శాంతి మాట్లాడుతూ అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశాల మేరకు గ్రామాల్లో పర్యటించి, ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. గ్రామ సమస్యలను పరిశీలించి ఎమ్మెల్యేకు తెలియజేస్తున్నామన్నారు. గృహ సారథులు నిర్మల, గ్రామ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం



సంపత్‌కుమార్, మండల కన్వీనర్

అరకులోయ రూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గ్రామాల్లో పర్యటించి, ఇంటింటికీ వెళ్లి విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని మండల కన్వీనర్ పట్టాసి సంపత్‌కుమార్ చెప్పారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశాల మేరకు మండలంలోని గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, గ్రామ వలంటీర్లకు ఈనెల 14 నుంచి 19వ తేదీ వరకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు. అనంతరం షెడ్యూల్ ప్రకారం వారు గ్రామాల్లో పర్యటించి సంక్షేమ పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తారన్నారు. పార్టీ శ్రేణులంతా సమష్టిగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో విధిగా పాల్గొవాలని కోరారు.

18న శివపార్వతుల కల్యాణం

అనకాపల్లిటౌన్ : మండలంలోని బట్లపూడి పంచాయతీ నాయుడుపేట గ్రామం సోహం ఆశ్రమంలో ఈ నెల 18న మహాశివరాత్రిని పురస్కరించుకుని శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆశ్రమం వ్యవస్థాపకుడు రవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్యాణంలో పాల్గొనే దంపతులు ముందుగా ఆశ్రమంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

కనులపండువగా ఆదిత్యుని కల్యాణం



పూజలు చేస్తున్న భక్తులు

యలమంచిలి: గొల్లలకొండపై వెలసి ఉన్న సూర్యనారాయణమూర్తి స్వామి ఆలయంలో మాఘమాసాన్ని పురస్కరించుకుని ఆదివారం కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం ప్రారంభమైన కల్యాణోత్సవం మధ్యాహ్నం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా అలంకరించిన వేదికపై స్వామి,అమ్మవార్లను అధిష్టంపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణం,చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.